ప్రశాంతంగా పోలింగ్

- 'ఉత్తర'లో సజావుగా ఎమ్మెల్సీ ఎన్నికలు
- 61 శాతం ఓటింగ్
- బారులు తీరి ఓటేసిన పట్టభద్రులు


ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ బూత్‌లో బారులు తీరిన పట్టభద్రులు

సీతంపేట: నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసేందుకు పట్టభద్రులు పోటెత్తారు. ఉదయం 8కి పోలింగ్ ప్రారంభం కాగా.. సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది.

సాధారణ ఎన్నికల తరహాలో పోలింగ్ స్టేషన్ల వద్ద పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి క్యూలైన్‌లో బారులు తీరారు. ఓటేసి బయటకు రావడానికి సుమారు గంటన్నర సమయం పట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉత్తర నియోజకవర్గానికి సంబంధించి 61 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. నక్కవానిపాలెం జీవీఎంసీ ప్రైమరీ స్కూల్‌లో 2, అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ ప్రైమరీ, హైస్కూల్‌లో 8, రైల్వే న్యూకాలనీ గర్ల్స్ హైస్కూల్, జీవీఎంసీ హైస్కూల్‌లో 5, కైలాసపురం డీఎల్‌బీ కల్యాణ మండపంలో 2, ఆర్సీ పేట ప్రైమరీ స్కూల్‌లో 3, మాధవధార జీవీఎంసీ హైస్కూల్లో 4, మర్రిపాలెం కేవీలో 3 చొప్పున పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా ఓటింగ్ జరిగింది.

అక్కయ్యపాలెంలో పోలింగ్ కేంద్రాల్లో..

అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలో జీవీఎంసీ హైస్కూల్, ప్రైమరీ స్కూళ్లలో ఏర్పాటు చేసిన 235, 235ఏ, 236, 236ఏ, 237, 237ఏ, 238, 239 పోలింగ్ బూత్‌ల్లో 14, 24, 25, 26, 42, 43, 44 వార్డులకు చెందిన పట్టభద్రులు ఓటేశారు. 235 పోలింగ్ బూత్‌లో 667 మంది, 235ఏ బూత్‌లో 487 మంది, 236 బూత్‌లో 517 మంది, 236ఏ బూత్‌లో 381 మంది, 237లో 447 మంది, 237ఏ బూత్‌లో 434 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తంగా ఈ కేంద్రంలో 2,933 మంది ఓటు వేశారు.

అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను వైఎస్సార్‌సీపీ నాయకులు సందర్శించారు. పార్టీ ఏర్పాటు చేసిన టేబుళ్ల వద్ద స్లిప్పులు పంపిణీని పరిశీలించారు. ఓటింగ్ జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు సాడిపిల్లి గోవింద్, పెద్దిశెట్టి ఉషశ్రీ, కె.అనిల్‌కుమార్‌రాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు. బీజేపీ మద్దతు ఎమ్మెల్సీ అభ్యర్థి పి.వి.ఎన్.మాధవ్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, భరత్ పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పీజీఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు క్యూలైన్‌లో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు.


డీఎల్‌బీ కల్యాణ మండపం వద్ద పోలింగ్ సరళిని హనోకును అడిగి తెలుసుకుంటున్న కె.కె.రాజు


నక్కవానిపాలెం పోలింగ్ బూత్ వద్ద ఓటర్ల నుంచి సెల్‌ఫోన్లు తీసుకుంటున్న పోలీసులు

పోలీసుల పర్యవేక్షణ

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ప్రాథమిక పాఠశాలలోని 240, 241 పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఓటు వేశారు. ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ ధరేంద్ర ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ గంగాధర్ రెడ్డి, సిబ్బంది పోలింగ్‌ను పర్యవేక్షించారు. ప్రతి ఒక్క ఓటర్‌ను తనిఖీ చేశారు. బూత్‌లోకి సెల్‌ఫోన్లు, పెన్నులు అనుమతించలేదు. ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. 240 పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు కొద్ది సేపు ఆలస్యం కావడంతో ఓటర్లు ఎండలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నప్పటికీ ఓటు వేసి వెళ్లారు.

డీఎల్‌బీ కల్యాణ మండపంలో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు కైలాసపురం డీఎల్‌బీ కల్యాణ మండపంలోని 263, 264 పోలింగ్ బూత్‌లను మాజీ ఎమ్మెల్యే వి.విష్ణుకుమార్‌రాజు, కార్పొరేటర్ గంగారావులతోపాటు పలువురు నాయకులు సందర్శించారు. పోలింగ్ కేంద్రం వద్ద డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌లను సెక్టార్ ఇన్‌చార్జి, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కలిసి పోలింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీ వార్డు అధ్యక్షుడు పైడిరమణ, నాయకులు నేపాల్ శ్రీను, సన్యాసప్పలనాయుడు, బాబూరావు, కారుకొండ రాజు, సన్నీ, ఆదిలక్ష్మి తదితరులు సహకరించారు.

ఓటర్లలో చైతన్యం

మురళీనగర్: మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలోని 267, 267ఏ, 268, 269 పోలింగ్ బూత్‌లకు ఓటర్లు అత్యధికంగా తరలిరావడంతో సందడి నెలకొంది. పోలీసులు పకడ్బందీగా చర్యలు తీసుకోవడంతో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, కంచరపాలెం సీఐ ఎస్.వి.జయకుమార్, ఎయిర్‌పోర్టు సీఐ బీఎండీ ప్రసాదరావు, ఎస్‌ఐ దివ్యభారతి, 30 మంది పోలీసు సిబ్బంది శాంతిభద్రతలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితిని వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సమీక్షించారు. 49, 50, 51, 53, 54 వార్డుల కార్పొరేటర్లు అల్లు శంకరరావు, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, పల్లా ఈశ్వరరావు, పార్టీ యలమంచిలి నియోజకవర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథం, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే వి.విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, భరత్, టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవి, నవనల వరప్రసాద్ పోలింగ్ సరళిని పరిశీలించారు.

ఓటేసిన వారు..

- 267 పోలింగ్ బూత్‌లో 563 మంది, 267ఏ బూత్‌లో 382 మంది, 268 బూత్‌లో 829 మంది, 269 బూత్‌లో 846 మంది పట్టభద్రులు ఓట్లు వేశారు. మొత్తంగా ఈ కేంద్రాల్లో 2,620 మంది(66.35 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- మర్రిపాలెం జ్యోతినగర్‌లోని 270 పోలింగ్ బూత్‌లో 737 మంది, 271 బూత్‌లో 655 మంది, 272 బూత్‌లో 725 మంది ఓటు వేశారు.

ఆర్సీ పేట కేంద్రాల్లో..

కంచరపాలెం: కంచరపాలెం పరిధి ఆర్సీ పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో 265, 265ఏ, 266, 266ఏ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 46, 47, 48, 54, 55, 56 వార్డులకు చెందిన పట్టభద్రులు ఈ కేంద్రాల వద్ద బారులు తీరి ఓటు వేశారు. 265 పోలింగ్ బూత్‌లో 709 మంది, 265ఏ బూత్‌లో 623 మంది, 266 బూత్‌లో 640 మంది, 266ఏ బూత్‌లో 298 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల సేవలు

ఆర్సీ పేట ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో కంచరపాలెం జంక్షన్ వద్ద 47, 48, 54, 55, 56 వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు టెంట్లు వేసి సేవలందించారు. పట్టభద్రులకు ఓటర్ స్లిప్పులు అందజేశారు. ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద ఎన్నికల సరళిని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పరిశీలించారు.

కార్పొరేటర్లు కె.వి.ఎన్.శశికళ, కె.కామేశ్వరి, ఆడారి శ్రీనివాసరావు, ఆయా వార్డుల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జులు కొల్లాబత్తుల వెంగళరావు, నీలి రవి, కర్రి రామారెడ్డి, పల్లా ఎర్నికుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉత్తర'లో 61 శాతం పోలింగ్

సీతంపేట: ఉత్తర నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో మొత్తం పట్టభద్రులు ఓటర్లు 17,948 మంది ఉండగా వారిలో 10,915 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ లెక్కన 61 శాతం పోలింగ్ నమోదైంది.

పోలింగ్ బూత్‌ల వారీగా ఓటింగ్ వివరాలు

బూత్ నంబర్	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు
235	1,200	667
235ఏ	880	487
236	820	517
236ఏ	782	381
237	745	447
237ఏ	806	434
238	1,110	666
239	790	485
240	860	527
241	620	399
263	880	561
264	831	481
265	1,100	709
265ఏ	1,049	623
266	1,023	640
266ఏ	520	300
267	821	563
267ఏ	566	382
268	1,300	800
269	1,245	846
మొత్తం	17,948	10,915


జ్యోతినగర్‌లోని 270 బూత్‌లో ఓటు వేస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్


మాధవధార పోలింగ్ బూత్ వద్ద క్యూలో ఓటర్లు


ఎన్జీజీవోస్ కాలనీ పోలింగ్ బూత్ వద్ద ఓటు వేసేందుకు క్యూలో ఉన్న గంట్ల శ్రీనుబాబు


కంచరపాలెం జంక్షన్‌లో స్లిప్పులు అందజేస్తున్న కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు


నక్కవానిపాలెం పాఠశాల పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు


మర్రిపాలెం జ్యోతినగర్ పోలింగ్ స్టేషన్ వద్ద ఓటు వేసేందుకు వేచి ఉన్న పట్టభద్రులు


టీడీపీ శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు


మాధవధారలో వైఎస్సార్‌సీపీ శిబిరం వద్ద కార్పొరేటర్లు, నాయకులు

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధి 11 కేవీ పీ అండ్ టీ కాలనీ ఫీడర్, 11 కేవీ శాంతిపురం ఫీడర్, ఎల్‌టీ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్–1 ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు శాంతిపురం, పీ అండ్ టీ కాలనీ, ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ ఏరియా, సునీత నర్సింగ్ హోం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

కనకమహాలక్ష్మికి నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం


కంకణ ధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు


సింహాచలం: సింహగిరి వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణ క్రతువును నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అర్చకులు అందజేశారు.

నేడు పోలిపిల్లమ్మ పండగ



సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అప్పన్నపాలెంవాసుల ఆరాధ్య దేవత పోలిపిల్లమ్మ తల్లి వార్షిక పండగను మంగళవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి తెలిపారు. ఆలయం వద్ద భక్తులకు మజ్జిగ, ప్రసాద వితరణ చేస్తున్నట్టు చెప్పారు. రాత్రి అనుపు మహోత్సవాన్ని పురస్కరించుకుని గరగల డ్యాన్స్, బాణసంచా కాల్పులు ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం నుంచి మూడు వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పండగ నేపథ్యంలో అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఐరిడి ఈశ్వరరావు, ట్రెజరర్ నానెల దేముడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నమో శివరుద్రాయ


ఉమాచంద్రమౌళీశ్వరుడు

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వపత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు నిర్వహించారు. శివ నామస్మరణలో మునిగితేలారు. ఆలయ అర్చకులు ద్వారక సోదరులు, ఉదయభాస్కర్ శర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

పేదల ఆరోగ్యానికి భరోసా

- ఆరోగ్య కేంద్రాల్లో మరిన్ని వైద్య సేవలు
- అందుబాటులోకి రక్త పరీక్షలు

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పేదల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తున్నాయి. ప్రస్తుతం ఈ కేంద్రాల్లో అన్ని రకాల వైద్య సేవలు అందుతున్నాయి. వీటితోపాటు మరిన్ని సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుమారు 18 రకాల రక్త పరీక్షలు, 55 రకాల ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కంచరపాలెం ఆర్సీ పేట, జ్ఞానాపురం, ఐస్గరడ్, రాంజీ ఎస్టేట్ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు చురుగ్గా సాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న వైద్య పరీక్షలకు అదనంగా మరో 8 రకాల పరీక్షలను ప్రభుత్వం ప్రజల ముందుకు తెచ్చింది.

24 గంటల్లో ఫలితాలు : కంచరపాలెం పీహెచ్‌సీకి ప్రతి రోజు 80 నుంచి 140 మంది వరకు రోగులు వస్తుంటారు. ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్లు, రక్త పరీక్షలకు కావాల్సిన ల్యాబ్ సామగ్రిని అందుబాటులో ఉంచారు. రోగులకు సంబంధించి రక్త నమూనాలను సిబ్బంది సేకరించి 24 గంటల్లో ఫలితాలను తెలియజేస్తారు. [illegible] ఆదా అవడమే కాకుండా శ్రమ కూడా తగ్గుతుంది.


ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న వైద్యాధికారి డాక్టర్ శశిప్రియాంక

రక్త పరీక్షల వివరాలు..

- టీఎస్‌సీ(తెల్ల రక్త కణాల లెక్కింపు)
- డీఎస్‌సీ(ఐదు రకాల రక్త కణాలకు సంబంధించిన పరీక్ష)
- ప్లేట్‌లెట్స్ కౌంట్
- ఎస్.బిలిరూబిన్(కామెర్లు)
- ఆర్‌ఏఆర్
- డెంగ్యూ ర్యాపిడ్ టెస్ట్
- స్టూల్ ఫర్ ఓవా అండ్‌సిస్ట్ (విరేచనాలకు సంబంధించి)
- టీజీ అండ్ డాట్స్(క్షయకు సంబంధించి పరీక్షలు)

మహిళా దినోత్సవ సందడి


వేడుకలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు


నృత్య ప్రదర్శనలో పాల్గొన్న బాలికలు

సీతంపేట: శారదా స్వర సంగమం ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికలు ఆటపాటలతో సందడి చేశారు. సంస్థ అధ్యక్షుడు లోకేష్ ఆధ్వర్యంలో పలువురు గాయనీ గాయకులు కరోకే ట్రాక్ సాంగ్స్ ఆలపించి అలరించారు. మహిళలు ప్రతిభా ప్రదర్శనలతో, చిన్నారుల నృత్యాలతో కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. వేదికపై ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రా ఆర్టిస్ట్స్ డైరెక్టర్ సన్‌మూర్తి, గాయకులు వి.రామ్‌కుమార్, బాలాజీ, ధనలక్ష్మి, సాత్విక, రేణుక, రవిచంద్ర, గీత, లక్ష్మి, స్వరూప, కవిత తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార రైతుబజార్‌లో తనిఖీలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో సోమవారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ ఆకస్మిక తనిఖీలు చేశారు. రైతుల స్టాల్ల వద్దకు వెళ్లి ఐడీ కార్డులు, ధరల పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబజార్‌ను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వినియోగదారులు కూరగాయలు కొనుక్కునేలా చూడాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల విక్రయాల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని రైతులకు సూచించారు. ద్వాక్రా స్టాల్‌లో సంబంధిత మహిళలే ఉండాలన్నారు. ఆకుకూరల రైతులు యాసిన్‌కు తమ సమస్యలు విన్నవించుకున్నారు. రైతుబజార్ ఈఓ కొండబాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.


రైతుబజార్‌లో తనిఖీ చేస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్

మానవ హక్కుల పరిరక్షణలో విఫలం

డాబాగార్డెన్స్: మానవ హక్కుల పరిరక్షణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయని మానవ హక్కుల కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగానే తరచూ మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయన్నారు. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ల పనితీరు దారుణంగా ఉందన్నారు. ఆ కమిషన్ల వల్ల ప్రజలకు పెద్దగా ప్రయోజనాలు చేకూరడం లేదన్నారు. మానవ హక్కుల్లో ప్రధానంగా జీవించే హక్కుని ప్రజలు కోల్పోతున్నారని అన్నారు. భావితరాలు మనుగడ సాధించాలంటే పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు.


మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించిన గణాంకాలు చూపుతున్న శ్యాంప్రసాద్

సమస్యల సాధనకు ఉద్యోగుల నిరసన

మహారాణిపేట: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాలుగో తరగతి ఉద్యోగులు సోమవారం నిరసన చేపట్టారు. ఏపీజేఏసీ పిలుపు మేరకు జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఐదో రోజుకు చేరింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉన్న సిబ్బంది, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సమస్యల సాధనకు పోరాటం కొనసాగిస్తామన్నారు.

16 నుంచి ఐఈటీఈ సాంకేతిక ఉత్సవం

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి అనుబంధంగా గల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఈటీఈ) ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సాంకేతిక యువజనోత్సవం ఐస్పైర్ – 2023 నిర్వహిస్తున్నట్టు విభాగాధిపతి ప్రొఫెసర్ జె.బి.సెవెస్టర్ తెలిపారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల ప్రదర్శనతోపాటు సాంకేతిక అంశాలపై నిపుణులు ప్రసంగిస్తారన్నారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరు రైతుబజార్‌లోని స్టాళ్లకు సోమవారం ఈవో వరలక్ష్మి సమక్షంలో డ్రా తీసి రైతులకు కేటాయించారు. తమకు కేటాయించిన స్టాల్లో రైతులు బుధవారం నుంచి విక్రయాలు జరుపనున్నారు.

760వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 760వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చుని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రభుత్వ రంగ సంస్థల జోలికి రాకుండా ఉండాలన్నారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించాలని, లేదంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు.


760వ రోజు ఉక్కు పరిరక్షణ దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు